క్లుప్తంగా

నేడు ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ తెలిపారు. గురువారం ఉదయం 9గంటలకు స్థానిక సంతపేట కరుమారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అనంతరం కూడలిలో వేడుకలు నిర్వహించి, మెడికల్ క్యాంప్‌లో స్థానికులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

18న వాహనాల వేలం

గుడిపాల: వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 18వ తేదీన గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పలు కేసుల్లో 37 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక స్కార్పియో, మారుతీ కారుకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చేసి పేరు నమోదు చేసుకుని వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారి

పూతలపట్టు(యాదమరి): విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని పూతలపట్టు మండల ప్రత్యేక అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పి.కొత్తకోట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల మేధో సామర్థ్యాలను పరిశీలించి వారిని అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

పదోన్నతిపై ఎంపీడీఓ రిలీవ్

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ధనలక్ష్మి బుధవారం రిలీవ్ అయ్యారు. డివిజనల్ లెవల్ అధికారిగా పదోన్నతి పొంది జిల్లా ఉపాధి కార్యాలయంలో ఏపీఓ(మానిటరింగ్, ఎవల్యూషన్) అధికారిగా నియమితులయ్యారు. ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా భువనేశ్వరి

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా భువనేశ్వరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా సంకటహర చతుర్థి

గుడిపాల: గుడిపాల మండలంలోని వసంతాపురంలో సుందర వినాయకస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా సంకటహర చతుర్థి నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలతో పాటు అభిషేకం చేశారు. మహిళలు పూజా కార్యక్రమంలో అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి

తవణంపల్లె : ఉపాధ్యాయులకు పీఆర్‌సీ అమలు చేసే వరకు ఐఆర్ 30 శాతం మంజూరు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియూ) జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. తవణంపల్లె హైస్కూల్లో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. వెంటనే వేతన సవరణ, కమీషన్‌కు చైర్మన్ నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు మధుబాబు, ప్రధాన కార్యదర్శి భువనేశ్వర్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూడు మ్యుటేషన్లు.. ఆరు వసూళ్లు



గుడిపాల తహసీల్దార్ కార్యాలయం

- గుడిపాల మండల రెవెన్యూలో రాజ్యమేలుతున్న అవినీతి
- మ్యుటేషన్ ఫైలు కదలాలంటే నోట్ల కట్ట చేతిలో పెట్టాల్సిందే
- వసూళ్ల పర్వంలో కీలకంగా మారిన కొందరు వీఆర్‌ఓలు
- కార్యాలయానికి అతిథుల్లా వచ్చి.. ఆపై ప్రైవేటు కార్యాలయంలో తిష్ట
- వందల్లో మ్యుటేషన్ ఫైళ్లు పెండింగ్
- పట్టించుకోని ఉన్నతాధికారులు

గుడిపాల: మండలంలో రెవెన్యూ అధికారులు అవినీతిమత్తులో జోగుతున్నారు. ఏ పని అడిగినా చేతిలో నోటు పెట్టనిదే ఫైల్ కదిలించడం లేదు. ఇక భూముల ఆన్‌లైన్ మ్యుటేషన్‌కు వెళ్లిన రైతులకు చేతిచమురు వదిలిస్తున్నారు. ఫైల్ కదలాలంటే కనీసం రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ఇస్తే తప్ప మోక్షం కలగదు. ఇవ్వకపోతే రైతులకు తిప్పలు తప్పవు. ఈ వసూళ్ల దందాలో కొందరు వీఆర్వోలు ముఖ్య భూమిక పోషిస్తున్నారనే ఆరోపణలు మండలంలో బలంగా వినిపిస్తున్నాయి. కార్యాలయ పరిధిలో 32 రెవెన్యూ గ్రామాలు ఉండగా 15 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. వీరి వద్దకు నెలకు 60 నుంచి 80 వరకు సరాసరి మ్యుటేషన్ దరఖాస్తులు వస్తుండగా.. వాటిలో కొందరు వీఆర్వోలు వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారు.

రైతులకు తప్పని కష్టాలు..

మండలంలో మ్యూటేషన్ ఫైల్లు సుమారు 120 వరకు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. గత మూడు నెలల నుంచి పెండింగ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు ప్రధాన కారణం కొందరు వీఆర్వోలేనని.. లంచం ఇవ్వని రైతుల ఫైళ్లను వీరు నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికి ఓ రేటు పెట్టుకున్నారు. కనీసం రూ.5 వేల నుంచి వసూళ్లు చేసుకుంటున్నారు. కొందరు పని త్వరగా జరిగిపోవాలని రూ.15 వేలు కూడా ఇచ్చుకున్న సంఘటనలు ఉన్నాయి. లంచం ఇవ్వకపోతే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటారు. డబ్బులు ఇవ్వరని తెలిస్తే..ఆ ఫైల్‌ను ఆన్‌లైన్‌లో నమోదు కానివ్వడం లేదు. దీంతో చాలామంది నిరుపేద రైతులు వీఆర్వోల వద్దకు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు.

అతిథుల్లా వచ్చి.. ప్రైవేటు పనుల్లో బిజీ..

కొందరు వీర్వోలు కార్యాలయానికి అతిథుల్లా వచ్చి వెళ్లిపోతున్నారు. ఆపై మధ్యాహ్నానికే ప్రైవేటు పనుల్లో బిజీ అవుతున్నారు. వీరి కోసం ప్రజలు కార్యాలయం వద్ద కాచుకుని కూర్చుంటున్నారు. కాసులొచ్చే పనులు ఉంటే మాత్రమే వారి ప్రైవేటు కార్యాలయానికి జనాలను అనుమతిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి.. వేళ్లూనుకుపోయిన ఈ అక్రమ వసూళ్లకు తెరదించి.. మ్యుటేషన్ కష్టాల నుంచి విముక్తి కలిగించాలని పలువురు రైతులు వేడుకుంటున్నారు.

మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయానికి మ్యుటేషన్ కోసం వెళ్లిన ఓ రైతుతో వీఆర్వో సంభాషణ ఇలా..

- **వీఆర్వో:** ఏమియా..ఏ ఇలా వచ్చావు..?
- **రైతు:** సామీ.. మా నాయనా చనిపోయినాడు.. పట్టా చేసుకోవాలి
- **వీఆర్వో:** పాసుబుక్ ఉందా.. మీ నాయనికి ఎంత మంది కొడుకులు..కూతుర్లు ? పోయి ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెటు, డెత్ సర్టిఫికెటు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పట్టుకుని రా..
- **రైతు:** అయ్యా అన్ని ఉండాయి. మా నాయనకు నేను ఒక్కడే కొడుకు..
- **వీఆర్వో:** అవునా నాకు తెలియకుండా ఎప్పుడుయా తీసుకున్నావ్.. ?
- **రైతు :** సార్ ఒక సంవత్సరం కిందట తీసుకున్నా.
- **వీఆర్వో:** అయితే నీదాంట్లో ఏమో ప్రాబ్లం ఉంది. నేను వచ్చి చూస్తా.. ఇప్పుడు టైం లేదు..రేపు రా..
- **రైతు:** ఏడాదిగా తిరుగుతా ఉండా.. ఇప్పుడు కూడా ఇలా అంటే ఎలా సామీ..
- **వీఆర్వో:** ఎంత ఉండాది నేల..?

రైతు: 1.30 ఎకరాలు ఉండాది సామి

- **వీఆర్వో:** సరేబ్బా.. ఇలా రా...వాళ్లంతా ఉండారు.. అందుకే ఇట్టా పిలిచా. ఎకరా అంటున్నావ్..రూ.10 వేలు ఇచ్చేయ్..వాళ్లకు వీళ్లకు కూడా ఇవ్వాలి. డబ్బులిస్తే..నీ పని చేసి పెడతారు. నేను ముందుగా సంతకం చేస్తేనే సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో ఎక్కిస్తాడు. లేదంటే నీకథ గోవిందా.. నీ పని కావాలంటే నాకిస్తే చాలు.. ఎమ్మార్వో ఆఫీసుకు ఇక రావద్దు.. ఎమ్మార్వోకు నేను చెప్పి మేనేజ్ చేస్తా.. నెలలో పాసుబుక్ నీ చేతిలో ఉంటాది. ఆలోచించుకో

రైతు: బీదోన్ని సామీ.. పని అయితే ఎంతో కొంత ఇస్తాను సూడండి సామీ..

- **వీఆర్వో:** సరే లేయా.. డబ్బులు ఎంత ఇస్తావో ఇచ్చేయ్.. ఫైలు తీసుకోరా.. నేను సంతకం పెట్టి ఇస్తా.. సచివాలయంలోకి పోయి అప్‌లై చెయ్యి.. తరువాత నేను చూసుకుంటా.. ఈ విషయాన్ని ఎక్కడా చెప్పకు.. ఇలా చాలామంది వచ్చారు.. నేను వాళ్లకి సంత కం పెట్టలేదు. మండలంలో వీఆర్‌ఓల దగ్గర చాలా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాలన్నీ ఎమ్మార్వోకి తెలియదు. గుర్తు పెట్టుకో.. ఎక్కడైనా చెప్పావో నీ కథ అంతే..

ఇదీ మండలంలో పరిస్థితి.. ఇలాంటి అక్రమ వసూళ్ల దందా ప్రతి రోజూ కార్యాలయంలో మూడు మ్యుటేషన్లు.. ఆరు దందాలు అన్నట్లు సాగుతోంది. అయితే రైతులు లంచాల విషయాన్ని బయటకు చెప్పడానికి భయపడుతున్నారు. ఎక్కడ తమ పని కాకుండా అధికారులు అడ్డు వేస్తారేమో అని. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి గాడి తప్పిన సిబ్బందిపై దృష్టి సారించి ప్రజలకు సేవలు అందేలా చూడాల్సి ఉంది.

నా దృష్టికి రాలేదు



మ్యుటేషన్‌కు సంబంధించి వీఆర్‌ఓలు డబ్బులు తీస్తుండడం నా దృష్టికి రాలేదు. రైతులు ఎవరైనా ఇచ్చినట్లయితే నా దృష్టికి ఆధారాలతో తీసుకువస్తే పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై చర్యలు ఖచ్చితంగా తీసుకుంటాం. ఈ విషయంపై వీఆర్‌ఓలతో ఓసారి సమావేశం నిర్వహించి చర్చిస్తా. **- శ్రీనివాసులు, తహసీల్దార్, గుడిపాల**

పెద్దిరెడ్డితో భేటీ



మాజీమంత్రి పెద్దిరెడ్డితో కలిసిన నాయకులు

పూతలపట్టు(యాదమరి): మాజీమంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని పూతలపట్టు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. బుధవారం హైదరాబాదులోని పెద్దిరెడ్డి నివాసంలో మండల సీనియర్ నేత తలపులపల్లి బాబురెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మిథున్‌రెడ్డి ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుందని త్వరలోనే రాజన్న రాజ్యం వస్తుందని ధీమా వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు.

ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన నేతలు



రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన పూతలపట్టు ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్, నేతలు

తవణంపల్లె: అక్రమ లిక్కర్ కేసులో అరెస్టు అయి.. బెయిల్‌పై ఉన్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్, మండల నాయకులు కలిశారు. ఎంపీ మిథున్‌రెడ్డి వారిని ఆప్యాయంగా పలకరించారు. మండల పార్టీ అధ్యక్షుడు హరిరెడ్డి, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తేజారెడ్డి, మాజీ ఎంపీటీసీ సుకేష్‌రెడ్డి, ఐరాల చంద్రారెడ్డి ఉన్నారు.

నృత్యశోభితం



నృత్యం చేస్తున్న కళాకారులు

కాణిపాకం: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ఆస్థాన మండపంలో బుధవారం నిర్వహించిన కళాకారులు నృత్య ప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం కళాకారులకు అధికారులు బహుమతులు ప్రదానం చేశారు.

చంద్రబాబు చెప్పినవన్నీ అబద్ధాలే



క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి నాయకులు

- చిత్తూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: సీఎం చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. బుధవారం స్థానిక 33, 34 డివిజన్ల పరంగా తేనె బండ ధర్మరాజుల గుడి సమీపంలో కోఆప్షన్ సభ్యులు అను, కార్పొరేటర్ షేక్‌మస్తానీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈవీఎంల మోసం వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ అనేక హామీలిచ్చారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక వాటి అమలుపై శ్రద్ధ చూపకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు పేరు చెబితే గుర్తుకు వచ్చే ఒక్కటంటే ఒక్క పథకం కూడా లేదన్నారు. అను, షేక్‌మస్తానీ, నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మాట్లాడుతూ పేదల కష్టాలను తన వంతుగా భావించే నాయకుడు విజయానందరెడ్డి అన్నారు. మార్కెట్ గేటు, ప్రభుత్వ ఆస్పత్రి పార్కింగ్‌కు కోట్లు నిధులు వెచ్చించి ఉచితం చేశారన్నారు. వరద సమయంలో ముంపు ప్రాంతవాసులకు సాయం చేశారన్నారు. అదే విధంగా కోవిడ్ సమయంలో తన వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం ఎన్నికల నాటి కూటమి మేనిఫెస్టో హామీల క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు హరిణిరెడ్డి, కృష్ణారెడ్డి, రాహుల్ రెడ్డి, నారాయణ, చాన్‌బాషా, అంజలిరెడ్డి, హరీషా రెడ్డి, నౌషద్, నవాజ్, మధు, చక్రి, మురళీ, అల్తాఫ్, చామంతి, చాపు, టిమ్ము, మనోహరరెడ్డి, లక్ష్మణ స్వామి, ముత్తు, సల్మా, హరి, అమ్ములు, హుస్సేన్, మస్తాన్, సాదిక్, బావాజాన్ పాల్గొన్నారు.

నేడు 5, 6, 7 డివిజన్లలో..

నగరంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక పోలీసుకాలనీలోని వినాయకుడి ఆలయ సమీపంలో 5, 6, 7 డివిజన్లలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు.

కిసాన్ డ్రోన్‌ను వినియోగించుకోండి

తవణంపల్లె: రైతు ఉత్పత్తిదారులు సంఘం ద్వారా అందిస్తున్న కిసాన్ డ్రోన్ పరికరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలకేంద్రం తవణంపల్లెలో రైతు ఉత్పత్తిదారుల సంఘం లిమిటెడ్ తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం రాయితీతో కిసాన్ డ్రోన్ పరికరాన్ని సరఫరా చేస్తోందన్నారు. రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారి శ్రీధర్ ఏపీఎంఎస్ డైరెక్టర్ వినాయకరెడ్డి, ఏంఎఓ ప్రవీణ్, ఎఫ్‌పీఓ సీఈఓ హిమశేఖర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

3 రోజుల వర్క్‌షాప్

తవణంపల్లె: మండలంలోని సంతపల్లె సమీపంలో ఉన్న శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు స్పిరుచ్యువల్ టాబ్లెట్ వర్క్‌షాప్ నిర్వహిస్తామని పిరమిడ్ మహాశక్తి క్షేత్రం ఫౌండర్, ప్రెసిడెంట్ డాక్టర్ బి.గోపాల కృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక తెలిపారు. వర్క్‌షాపులో శారీరక, మానసిక, దీర్ఘకాలిక వ్యాధులతో, ఇతర సమస్యలతో సతమతమవుతున్న వారు ఈ వర్క్‌షాపులో పాల్గొనవచ్చన్నారు.

గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పించండి

చిత్తూరు కలెక్టరేట్ : పశువుల్లో గాలికుంటు వ్యాధిపై చేపట్టాల్సిన నివారణ చర్యలను పాడి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల అవగాహన పోస్టర్‌లను ఆవిష్కరించారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోస్టర్ ఆవిష్కరణ

యాదమరి: విద్యార్థులలో ప్రతిభను గుర్తించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ దామోదర్‌రెడ్డి చెప్పారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం లలిత ఆధ్వర్యంలో వీవీఎం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఈ పరీక్షలకు ఆరో తరగతి నుంచి 11వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రూ.24వే లు స్కాలర్‌షిప్పుతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన వారికి ప్రత్యేక బహుమతులు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకాచారి, రాష్ట్ర కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ సరళింపుపై హర్షం

చిత్తూరు కార్పొరేషన్: పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా జీఎస్‌టీ సరళతరం చేయడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం గాంధీ విగ్రహం వద్ద పీఎం మోదీ, ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ద్వారా ప్రజలకు అవసరమైన వస్తు ఉత్పత్తుల ధరలు తగ్గనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు రామభద్ర, షణ్ముగం,గోకుల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆటోయూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఆటో డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అక్టోబర్ 6న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. బుధవారం నగరంలో జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. అధిక సంఖ్యలో యువత చదువుకుని ఉద్యోగాలు లేక ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పలువురు అప్పులు చేసి వాహనాలను కొనుగోలు చేసి నడుపుతున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందడం లేదన్నారు. గతంలో ఆటోడ్రైవర్లకు వాహనమిత్ర పథకం కింద సాయం అందించేవారని గుర్తు చేశారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెరిగిందన్నారు. ఓ వైపు కార్పొరేట్ సంస్థలు ట్రావెల్స్ రంగంలో ప్రవేశించడంతో వీరి ఆదాయం తగ్గిందన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేయడంతో ఆటోడ్రైవర్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారిందన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 21, 31 వల్ల తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, గోపినాథ్, రమాదేవి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

బంగారుపాళెం : పెంపుడు కుక్కల పట్ల యజమానులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ ఆరీఫ్ సూచించారు. బుధవారం బంగారుపాళెం ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణలో పెంపుడు కుక్కల ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరానికి 80 ఉత్తమ జాతి పెంపుడు కుక్కలను వాటి యజమానులు తీసుకొచ్చారు. అనంతరం ఉత్తమ జాతి కుక్కల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన కుక్కల యజమానులకు బహుమతితో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ ఆసీఫ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ ఝూన్సీ, పశువైద్యులు దినేష్, పవన్, దత్తా కుమారి, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం, పేయనపల్లె రైతు సేవా కేంద్రాల్లో రైతులకు గురువారం యూరియా పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ ఏడీ ఉమా తెలిపారు. బుధవారం బొమ్మసముద్రం ఆర్‌ఎస్‌కేలో యూరియాను దిగుమతి చేశారు. ఆమె మాట్లాడుతూ రెండు ఆర్‌ఎస్‌కేలకు సంబంధించి 300 బస్తాలు వచ్చాయన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డ్ జిరాక్స్ కాపీ తీసుకురావాలని, బయోమెట్రిక్ ద్వారా ఒక రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తామన్నారు. ఏఓ ఉన్నారు.

బిల్లుస్టాప్ సర్వీసులను తనిఖీ చేయండి

చిత్తూరు కార్పొరేషన్ : బిల్లు స్టాప్ చేసిన ఎస్సీ, ఎస్టీ సర్వీసులను తనిఖీ చేయాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య తెలిపారు. బుధవారం ఎస్‌ఈ కార్యాలయంలో రూరల్ డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సర్వీసుదారులకు 200 యూనిట్లు ఉచితంగా విద్యుత్‌ను ప్రభుత్వం ఇస్తోందన్నారు. కొందరు కాలనీల్లో 200 యూనిట్లు పైగా వినియోగించి బిల్లులు కట్టలేదన్నారు. దీంతో వారి నివాసాలకు మీటర్లు తొలగించారన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి డబ్బులు కట్టించి మీటర్లు ఇవ్వాలని ఆదేశించారు. అదనపులోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీపై అవగాహన కల్పించాలన్నారు. ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సురేష్, జగదీష్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

త్వరలోనే గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు విడుదల

యాదమరి : గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు త్వరలోనే విడుదల అవుతాయని జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు చెప్పారు. బుధవారం ఆయన జిల్లా పంచాయతీ అధికారి సుధాకరరావుతో కలిసి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలోనే 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కానున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణు, ఈఓపీఆర్డీ రామరాజు రామచంద్ర, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌తో అప్రమత్తంగా ఉండండి



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని "నా ఆరోగ్యం నా హక్కు నినాదం"తో ముందు కెళ్లాలని, ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, సీఐలు నిత్యబాబు, మహేశ్వర తెలిపారు. చిత్తూరు నగరంలో బుధవారం జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో రెడ్ రన్ మారథాన్ నిర్వహించారు. ఈ రన్ మెసానికల్ మైదానం నుంచి పీవీకేఎన్ వరకు సాగింది. వారు మాట్లాడుతూ.. చాలామంది ఎయిడ్స్ వ్యాధి వచ్చినట్లయితే చాలా ఇబ్బంది పడుతుంటారన్నారు. ఎయిడ్స్ సోకిన వారిని ఎవరూ చులకనగా చూడకూడదన్నారు. మందులు వాడితే ఎయిడ్స్ తగ్గుముఖం పడుతుందని, ఎవరికైనా వ్యాధి ఉన్నట్టు తెలిస్తే ముఖ్యంగా గర్భిణులు చెక్ చేయించుకోవాలన్నారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. దేశంలోనే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో రాష్ట్రం రెండవ స్థానంలో ఉందన్నారు. మన జిల్లాలో ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా చికిత్స పొందుచున్న హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు సుమారు 3 వేల మంది ఉన్నారన్నారు. జిల్లాలో మొత్తం 9 ఐసీటీసీ కేంద్రాల ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం రన్‌లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.